క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఏలూరు (ఆర్ఆర్‌పేట): స్థానిక శాంతినగర్ సబ్‌స్టేషన్ పరిధిలో చెట్ల కొమ్మల తొలగింపు, లైన్ల వార్షిక మరమ్మతుల నిమిత్తం గురువారం వివిధ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఈపీడీసీఎల్ ఏలూరు డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ జేపీబీ నటరాజన్ ఒక ప్రకటనలో తెలిపారు. గ్రేవియర్ నగర్, కట్టా సుబ్బారావు తోట, విద్యా నగర్ సాయిబాబా మందిరం, శాత వాహన నగర్ ప్రాంతాల్లో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని పేర్కొన్నారు.

కలెక్టర్‌కు రైతువాణి పత్రిక అందజేత



కలెక్టర్‌కు రైతు వాణిని ఇస్తున్న నాయకులు

ఏలూరు (టూటౌన్): ఏలూరు జిల్లా కలెక్టర్‌గా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన వెట్రి సెల్వికి ఏపీ రైతు సంఘం నాయకులు మన రైతు వాణి వ్యవసాయ పత్రికను అందజేశారు. ఏపీ రైతు సంఘం జిల్లా కమిటీ తరుపున జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ కలెక్టర్‌కు శుభాకాంక్షలు తెలిపారు. జిల్లాలో రైతాంగ సమస్యలపై దృష్టి సారించాలని కోరారు. కార్యక్రమంలో పలువురు రైతు సంఘం నాయకులు పాల్గొన్నారు.

కలెక్టర్ దృష్టికి రజకుల సమస్యలు



కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న కట్లయ్య

ఏలూరు (టూటౌన్): రజకుల సమస్యల పరిష్కారానికి సహకరించాలని ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా రజక జన సంఘం అధ్యక్షుడు చిలకలపల్లి కట్లయ్య కలెక్టర్ వెట్రి సెల్విని కోరారు. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ఆమెను బుధవారం కట్లయ్య కలిసి శుభాకాంక్షలు తెలిపారు. జీఓ 62 ప్రకారం రజకుల వృత్తి, కుల పరమైన సమస్యలు పరిష్కారానికి కృషి చేస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సంఘం నాయకులు వి.శ్రీనివాసరావు, కమ్మంటి మురళి, కోలుకొండ రత్తయ్య, కడెల్లి సుబ్బయ్య, పదిగల్ల శ్రీనివాసరావు, సాంబశివరావు, దుర్గారావు పాల్గొన్నారు.

కేసుల దర్యాప్తులో అలసత్వం వద్దు

దిశ పోలీస్‌స్టేషన్‌లో ఎస్పీ ఆకస్మిక తనిఖీ



ఏలూరు దిశ పోలీస్‌స్టేషన్ వద్ద మహిళలతో మాట్లాడుతున్న ఎస్పీ మేరీ ప్రశాంతి

ఏలూరు టౌన్: పోలీస్ స్టేషన్‌కు వచ్చే మహిళల బాధలు, ఆవేదనను అర్థం చేసుకుని, వారికి న్యాయం చేయాలని, కేసుల దర్యాప్తులో అలసత్వం ప్రదర్శిస్తే చర్యలు తప్పవని ఎస్పీ డి.మేరీ ప్రశాంతి హెచ్చరించారు. ఏలూరు వన్‌టౌన్ కోటదిబ్బ దిశ మహిళా పోలీస్ స్టేషన్‌ను బుధవారం ఎస్పీ ఆకస్మికంగా తనిఖీ చేశారు. దిశ స్టేషన్ హెల్ప్ డెస్క్ సేవలను పరిశీలించారు. మహిళా పోలీస్‌స్టేషన్ వద్ద ఉన్న మహిళలతో మాట్లాడారు. వారికి అందుతోన్న సేవలపై ఆరా తీశారు. రికార్డులను తనిఖీ చేశారు. కేసుల నమోదు, పరిష్కారం, నిందితుల అరెస్టులపై సీఐ విశ్వం, ఎస్సై క్రాంతిప్రియను అడిగి తెలుసుకున్నారు. పోలీస్‌స్టేషన్ ప్రాంగణాన్ని, అక్కడి పరిస్థితులను ఎస్పీ పరిశీలించారు. ప్రాంగణంలో పచ్చదనం, ఆహ్లాదకరమైన వాతావరణానికి మొక్కలు నాటాలని సూచించారు. ఎస్పీ మేరీ ప్రశాంతి మాట్లాడుతూ ఫిర్యాదు చేసేందుకు వచ్చే మహిళలతో మర్యాదగా వ్యవహరించాలని, ప్రతి సమస్యనూ హెల్ప్ డెస్క్‌లో నమోదు చేసి రశీదు ఇవ్వాలని ఆదేశించారు. కేసుల నమోదు, నిందితుల అరెస్టులు, కేసులకు సంబంధించి కోర్టులో ఛార్జిషీట్ దాఖలు వంటి అంశాలపై పోలీస్ సిబ్బంది సరైన రీతిలో విధులు నిర్వర్తించాలని ఆదేశించారు.

దళితులకు భూమిని అప్పగించాలంటూ ధర్నా



కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న శింగనపూడి దళితులు

ఏలూరు (టూటౌన్): తమకు భూమి అప్పగించి న్యాయం చేయాలంటూ ఏపీ రైతు సంఘం ఆధ్వర్యంలో శింగనపూడి దళితులు ఏలూరు కలెక్టరేట్ వద్ద బుధవారం ధర్నా చేశారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ మాట్లాడుతూ కైకలూరు మండలం శింగనపూడి గ్రామానికి చెందిన 20 దళిత కుటుంబాలకు ప్రభుత్వం ఇచ్చిన 15.59 ఎకరాల భూమిని 1925 నుంచి ఫీల్డ్ లేబర్ కోఆపరేటివ్ సొసైటీ పేరుతో సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారని తెలిపారు. 1992లో చేపల సాగుకు ప్రభుత్వం అనుమతివ్వగా పెద్ద మొత్తంలో పెట్టుబడి పెట్టలేక కైకలూరుకు చెందిన మాడపాటి కృష్ణప్రసాద్‌కు లీజుకు ఇచ్చారని చెప్పారు. కొంతకాలం లీజు ఇచ్చి ఆ తర్వాత లీజు ఇవ్వకుండా భూమిలోకి హక్కుదారులను రానివ్వకుండా అక్రమంగా సాగు చేసుకుంటున్నారని ఆరోపించారు. 2016 నుంచి అధికారుల చుట్టూ దళితులు తిరుగుతున్నారని, 2022లో గుడివాడ ఆర్డీఓ దళితులకు అనుకూలంగా తీర్పు ఇవ్వగా అమలు కాలేదని వివరించారు. జేసీ కోర్టులో ఈ భూ సమస్య కేసు నడుస్తోందని, తుదితీర్పు ఇచ్చే వరకు భూమిలోకి ఇరుపక్షాలు వెళ్లకుండా జేసీ ఆదేశాలు ఇచ్చారని గుర్తుచేశారు. దీనిపై స్థానిక తహసీల్దార్ ఏర్పాటు చేసిన ఫ్లెక్స్ బోర్డును తొలగించి జేసీ ఆదేశాలను ధిక్కరించి మాడపాటి కృష్ణ ప్రసాద్ దళితులపై దౌర్జన్యం చేసి చేపలు సాగు చేస్తున్నారని వివరించారు. భూ సమస్యను పరిష్కరించి దళితుల భూమిని దళితులకే అప్పగించి న్యాయం చేయాలని శ్రీనివాస్ డిమాండ్ చేశారు. అనంతరం జేసీ బి.లావణ్యవేణికి వినతి పత్రం అందజేశారు. సొసైటీ అధ్యక్షుడు కర్రా జగదీష్, సభ్యులు పక్కిరి దావీదు, పక్కిరి ఇజ్రాయేలు, పులి సువర్ణరాజు, పి.పౌలు, బొడ్డు ఆదాము పాల్గొన్నారు.

గ్రామాల్లో పారిశుధ్య పనులు



చాటపర్రులో బ్లీచింగ్ చల్లుతున్న సిబ్బంది



మల్కాపురంలో డ్రెయినేజీ పనులు పరిశీలిస్తున్న ఈఓపీఆర్డీ సరళకుమారి

ఏలూరు రూరల్ : గ్రామాల్లో డయేరియా నిర్మూలన కోసం ప్రత్యేక చర్యలు చేపట్టామని ఈఓపీఆర్డీ ఎం సరళకుమారి అన్నారు. బుధవారం ఆమె మల్కాపురం, చాటపర్రు గ్రామాల్లో పర్యటించారు. జిల్లా పంచాయతీ అధికారి ఆదేశాల మేరకు ఈ నెల 26 నుంచి 30 వరకు 15 పంచాయతీల్లో స్టాప్ డయేరియా కార్యక్రమం చేపట్టామన్నారు. ఇందులో భాగంగా ప్రతిరోజూ చెత్తా చెదారం, డ్రెయినేజీలో సిల్ట్ తొలగింపు, రోడ్ల శుభ్రత, తాగునీరు శుభ్రత, పైలాన్ మరమ్మతు పనులు చేయిస్తామని తెలిపారు. తొలి రోజు ఉదయం 6 గంటల నుంచి పల్లె ప్రజలకు తాగునీరు అందించే ఓవర్‌హెడ్ ట్యాంకులు శుభ్రం చేయించామన్నారు. నీటి స్వచ్ఛత పెరిగేలా క్లోరినేషన్ చేశామని చెప్పారు. పారిశుధ్యం సిబ్బందితో పారిశుధ్యం మెరుగుదలకు చర్యలు తీసుకున్నామని తెలిపారు. ఖాళీ ప్రాంతాలు, రోడ్లు, డ్రెయినేజీ పరిసరాల్లో చెత్త తీసి బ్లీచింగ్ చల్లించామన్నారు.

ఘనంగా ఛత్రపతి సాహు మహరాజ్ జయంతి



సాహు మహరాజ్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

ఏలూరు (టూటౌన్): ఛత్రపతి సాహు మహరాజ్ 150వ జయంతి కార్యక్రమాలను ఏలూరు నగరంలోని పలుచోట్ల బుధవారం ఘనంగా నిర్వహించారు. కర్రే అంబేడ్కర్ అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమాల్లో బీఎస్పీ నాయకులు నేతల రమేష్ బాబు ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. వట్లూరు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద, బహుజన సమాజ్ పార్టీ కార్యాలయంలో జయంతి కార్యక్రమాలు నిర్వహించారు. దేశంలో రిజర్వేషన్లు అమలు చేసిన తొలి అభ్యుదయ వాది, రిజర్వేషన్ల పితామహుడు అని కొనియాడారు. బాబాసాహెబ్ అంబేడ్కర్‌కి విదేశాల్లో విద్య నేర్చుకోవడానికి స్కాలర్ షిప్ అందించడమే కాకుండా ఆయన ప్రారంభించిన మూక్ నాయక్ పత్రిక నడపటానికి ఆర్థికంగా ఎంతో సహకారం అందించారన్నారు. మేతర అజయ్ బాబు మాట్లాడుతూ సాహు మహరాజ్ చేసిన సేవలను కొనియాడారు. అఖిల భారత తపాలా ఎస్సీ, ఎస్టీ, ఉద్యోగుల సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు దాసరి నాగేంద్ర కుమార్ మాట్లాడుతూ భారత దేశంలో ఛత్రపతి సాహు మహరాజ్ తీసుకొచ్చిన సంస్కరణల వల్లే అందరికీ విద్య, ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడానికి బాబా సాహెబ్ అంబేడ్కర్ రాజ్యాంగంలో రిజర్వేషన్ల విధానాన్ని తీసుకొచ్చారని గుర్తుచేశారు. కార్యక్రమాల్లో కొత్తల పూర్ణ మల్లికార్జున్, భూపతి అప్పారావు, కర్రి వేణుగోపాలరావు, కర్రే ప్రదీప్, పోపోలు రఘు, పిడిగే రాయప్ప తదితరులు పాల్గొన్నారు.

15న జగన్నాథ రథ యాత్ర

ఏలూరు (ఆర్ఆర్‌పేట): స్థానిక ఇస్కాన్ సంస్థ ఆధ్వర్యంలో జూలై 15వ తేదీన నిర్వహించే జగన్నాథ రథ యాత్రలో ప్రజలంతా భాగస్వాములు కావాలని ఎమ్మెల్యే బడేటి చంటి పిలుపునిచ్చారు. బుధవారం చంటి క్యాంపు కార్యాలయంలో జగన్నాథ రథ యాత్రకు సంబంధించిన వాల్ పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా చంటి మాట్లాడుతూ ఏలూరు నగరంలో రెండోసారి రథ యాత్ర నిర్వహించడానికి ఇస్కాన్ ప్రతినిధులు ఏర్పాటు చేయడం ఆహ్వానించదగ్గ పరిణామమన్నారు. ఇస్కాన్ ప్రతినిధి రాధా వల్లభ దాస్ మాట్లాడుతూ రథయాత్ర స్థానిక శనివారపు పేట రోడ్డులోని లునాని పార్కు వద్ద నుంచి మధ్యాహ్నం 2 గంటలకు ప్రారంభమై ఆర్ఆర్‌పేట, మెయిన్ బజారు, ఫైర్ స్టేషన్ సెంటర్, పెద్ద వంతెన, వన్‌టౌన్, మెయిన్ బజారు మీదుగా తిరిగి రామకోటి వద్దకు చేరుకుంటుందన్నారు. రామకోటి ప్రాంగణంలో స్వామి వారికి పుష్పాభిషేకం, చప్పన్ భోగ నైవేద్యం, జగన్నాథ లీలా ప్రవచన కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. భక్తులందరికీ జగన్నాథ ప్రసాద వితరణ చేస్తామన్నారు. కార్యక్రమంలో నగరపాలక సంస్థ కోఆప్షన్ సభ్యుడు ఎస్ఎంఆర్ పెదబాబు, ఇస్కాన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

ఏలూరులో అధ్వానంగా శానిటేషన్



ఎమ్మెల్యే చంటిని సత్కరిస్తున్న మేయర్ దంపతులు

ఏలూరు టౌన్: ఏలూరు నగరంలో శానిటేషన్ పరిస్థితి అధ్వానంగా ఉందని, సూపర్‌వైజర్ల పనితీరు బాగోలేదని ఎమ్మెల్యే బడేటి రాధాకృష్ణయ్య (చంటి) అసంతృప్తి వ్యక్తం చేశారు. ఏలూరు నగరపాలక సంస్థ పాత కౌన్సిల్ హాలులో పబ్లిక్ హెల్త్ విభాగం సమీక్షా సమావేశం మేయర్ షేక్ నూర్జహాన్, నగర కమిషనర్ సంక్రాంతి వెంకటకృష్ణ, కోఆప్షన్ సభ్యుడు ఎస్ఎంఆర్ పెదబాబుతో కలిసి ఆయన సమీక్షించారు. ఏలూరు కార్పొరేషన్ పరిధిలో పబ్లిక్ హెల్త్ విభాగంలోని పరిస్థితులపై ఆరా తీశారు. నగరంలో శానిటేషన్ అధ్వానంగా మారిందని, సిబ్బంది ఉన్నప్పటికీ పర్యవేక్షణ లోపంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించలేని పక్షంలో చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చంటిని మేయర్ నూర్జహాన్, పెదబాబు, కార్పొరేటర్లు భీమవరపు హేమసుందరి ఘనంగా సత్కరించారు. ఎంహెచ్ఓ డాక్టర్ మాలతి, కార్పొరేషన్ సెక్రటరీ దివ్య కుమారి, ఇన్‌చార్జి ఎంఈ కొండలరావు, డీఈలు, ఏఈలు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, మేస్త్రీలు, సచివాలయ శానిటరీ సెక్రటరీలు, కార్పొరేటర్లు ఉన్నారు.

అన్నప్రసాద వితరణ

జంగారెడ్డిగూడెం: పట్టణంలోని వరసిద్ధి వినాయక స్వామి ఆలయంలో బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన అన్నసమారాధనలో సుమారు 1600 మంది భక్తులు అన్నప్రసాదాన్ని స్వీకరించారు. హైదరాబాద్‌కు చెందిన చింతలపూడి సరోజిని, వారి మనుమరాళ్లు సాత్విక, యువిక పుట్టిన రోజు సందర్భంగా అన్నప్రసాద వితరణ చేసినట్లు కమిటీ సభ్యులు చెప్పారు. బుట్టాయగూడెం రోడ్‌లోని చిన్నపిల్లల అనాథశ్రమానికి అన్నప్రసాదాన్ని అందించారు.

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్ఈఎల్ వయా విజయవాడ (ఇంద్ర)	21.00	33
ఏలూరు -బీహెచ్ఈఎల్ (అమరావతి)	22.00	40
ఏలూరు - బీహెచ్ఈఎల్ (అమరావతి)	22.30	44
ఏలూరు - తిరుపతి(ఇంద్ర)	16.00	--
ఏలూరు - తిరుపతి(ఇంద్ర)	19.00	30

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు - బీహెచ్ఈఎల్	21.45	4820	29
ఏలూరు - బీహెచ్ఈఎల్	21,.15	4822	31
ఏలూరు - బీహెచ్ఈఎల్ వయా కే.కోట	19.30	4796	23
ఏలూరు -బీహెచ్ఈఎల్ వయా రామచంద్రపురం	19.45	4798	28
ఏలూరు - బీహెచ్ఈఎల్ వయా ఖమ్మం	20.30	4800	30
ఏలూరు - జీడిమెట్ల వయా ఖమ్మం	20.15	4802	25
ఏలూరు - జీడిమెట్ల వయా ఖమ్మం	21.00	4804	32
ఏలూరు - ఈసీఐఎల్	22.30	4814	27
ఏలూరు - బీహెచ్ఈఎల్ వయా ఖమ్మం	20.20	98511	00
ఏలూరు - బీహెచ్ఈఎల్	21.10	98503	00
ఏలూరు - తిరుపతి	16.00	4830	11

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర	కూరగాయలు	కిలో ధర
టమాటాలు	50	అరటి కాయ (1)	05-07
వంకాయలు (గులాబీ)	24	చిక్కుడు కాయలు	92
వంకాయలు (కాంతులు)	38	చామదుంపలు	44
వంకాయలు (తెలుపు)	40	ములక్కాడలు	05, 07
బెండకాయలు	34	కంద	64
పచ్చిమిర్చి	44	బీట్‌రూట్	36
కాకర కాయలు	50-60	కీరా దోస	40
బీరకాయలు	44	ఫ్రెంచ్‌బీన్స్	116
బీరకాయలు (పందిరి)	64	అల్లం	180
క్యాబేజీ	40	కొత్తిమీర (కట్ట)	25
క్యారెట్	34-52	పాలకూర	12
దొండకాయలు	24	చుక్కకూర	12
బంగాళదుంపలు	38	తోటకూర	10
ఉల్లిపాయలు	38	గోంగూర	07
గోరుచిక్కుడు	--	పుదీనా	05
దోసకాయలు	26	బఠాణి	--
ఆనబకాయ (1)	10-15	క్యాప్సికమ్	90
పొట్లకాయ(1)	15	చిలకడదుంప	40

చిన్నారులంతా బడిలోనే ఉండాలి

దెందులూరు: బడిఈడు చిన్నారులంతా బడిలోనే ఉండాలని, 90 రోజుల బడికిపోదాం స్పెషల్ డ్రైవ్‌ను విజయవంతం చేయాలని ఎంపీడీఓ వి.శ్రీలత అన్నారు. బుధవారం ఎంపీడీఓ కార్యాలయంలో ఎంఈఓలు కె.అన్నమ్మ, ఏవీఎస్వీ ప్రసాద్ అన్ని పాఠశాలల హెచ్ఎంలతో సమావేశం నిర్వహించారు. ఎంపీడీఓ శ్రీలత మాట్లాడుతూ ఏగ్రామంలోనూ చదువుతున్న చిన్నారులు, బడిఈడు చిన్నారులు, బడిబయట ఉండరాదని అన్నారు.

శ్మశానవాటిక ఆధునికీకరణ పనులు

దెందులూరు: చల్లచింతలపూడిలో శ్మశానవాటిక ఆక్రమణలకు గురికావడం, చెత్తాచెదారం, పిచ్చిమొక్కలు పెరిగిపోవడంతో ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ సూచనల మేరకు బుధవారం టీడీపీ నాయకులు జేసీబీతో ఆధునికీకరణ పనులు చేపట్టారు. వైఎస్సార్ సీపీ నేత, గ్రామ సర్పంచ్ బైగాని వెంకటేశ్వరమ్మ శ్రీమన్నారాయణ, టీడీపీ నాయకులు నాగనబోయిన సత్యనారాయణ, ముమ్మడి మోహనరావు, వేమన రాము, మోదుగమూడి రాంబాబుల నిధులతో ఈ పనులు చేశారు. గ్రామ కార్యదర్శి ఆనంద్ తదితరులు ఉన్నారు.

256 మందికి వైద్యపరీక్షలు

దెందులూరు: ప్రభుత్వంతో పాటు స్వచ్ఛంద సంస్థలు గ్రామ శివారు ప్రాంత ప్రజల సంపూర్ణ ఆరోగ్యానికి ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించడం స్ఫూర్తిదాయకమని ఆదర్శరైతు వీరమాచనేని శివాజీ, దెందులూరు శ్రీరామదండు నాయకులు సుగ్గిశెట్టి సూకరాజు అన్నారు. బుధవారం దెందులూరు పుష్ప కల్యాణమండపంలో మాతృదేవో భవ ట్రస్టు, శ్రీరామదండు సంయుక్త ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరం ఏర్పాటుచేశారు. 256 మందికి వైద్య సేవలందించారు. కళ్లు, దంతాలు, కీళ్ల నొప్పులు, బీపీ, షుగరు, కీళ్ల వ్యాధులు, వెన్నునొప్పి, కీళ్ల మార్పిడి వ్యాధులకు సంబంధించి పరీక్షలు చేశారు. ఉచితంగా మందులు అందజేశారు. శిబిరంలో దెందులూరు నర్సింగ్ కాలేజీ విద్యార్థినులు సహకారం అందించారు.

మాదక ద్రవ్యాల వినియోగం నష్టదాయకం

పెదపాడు : మాదక ద్రవ్యాల వినియోగం వ్యసనంగా మారితే జీవితాలను బలిగొంటాయని ఎస్సై శుభశేఖర్ హెచ్చరించారు. పెదపాడు జూనియర్ కళాశాలలో విద్యార్థులకు మాదక ద్రవ్యాల నిరోధంపై అంతర్జాతీయ మాదక ద్రవ్యాల నిరోధక చట్టంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఎస్సై శుభశేఖర్ మాట్లాడుతూ గంజాయి, తంబాకు, గుట్కాలు వంటిని వినియోగించడంతో అనారోగ్యాలు భారిన పడుతున్నారని తెలిపారు. వాటి వల్ల కలిగే అనర్థాలను వివరించారు.

తలసేమియా చిన్నారులకు రక్తమార్పిడి చికిత్స



చికిత్స పొందుతున్న చిన్నారిని పరిశీలిస్తున్న కృష్ణారెడ్డి, వరప్రసాదరావు

ఏలూరు టౌన్: స్థానిక సర్వజన ఆసుపత్రి ప్రాంగణంలోని రెడ్‌క్రాస్ భవనంలో తలసేమియా బాధిత చిన్నారులకు, సికిల్ సెల్ ఎనీమియా బాధితులకు రక్తమార్పిడి చికిత్స అందిస్తూ వారికి అండగా ఉంటున్నామని ఏలూరు జిల్లా రెడ్‌క్రాస్ చైర్మన్ బీవీ కృష్ణారెడ్డి అన్నారు. రక్తమార్పిడి చికిత్స పొందుతున్న చిన్నారులను ఆయన పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకున్నారు. సమాజంలో కొందరు పిల్లలు రక్త సంబంధిత వ్యాధులతో బాధపడుతున్నారని, ఆరోగ్యంగా ఉన్న యువత మాదక ద్రవ్యాలకు బానిసలుగా మారిపోయి జీవితాన్ని నాశనం చేసుకోవటం బాధాకరమని తెలిపారు. మత్తు పదార్థాలకు యువత, విద్యార్థులు దూరంగా ఉండాలని, జీవితంలో ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని, వాటి సాధనకు కృషి చేయాలని సూచించారు. యువత డ్రగ్స్‌తో కలిగే అనర్థాలపై అవగాహన కలిగి దూరంగా ఉండాలని కోరారు. బుధవారం రెడ్‌క్రాస్ భవనంలో తలసేమియా బాధిత చిన్నారులతోపాటు సహాయకులు 30 మందికి మానవత సభ్యులు టి.రామకృష్ణ ఉచిత భోజనం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ సెక్రటరీ కేబీ సీతారాం, డాక్టర్ ఆర్ఎస్ఆర్‌కే వరప్రసాదరావు, గౌరవ కార్యదర్శి కడియాల కృష్ణారావు, డాక్టర్ జి.స్పందన, పీఆర్వో కేవీ రమణ, సిబ్బంది ఉన్నారు.

మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలి



కళాశాలలో మాట్లాడుతున్న డీఎస్పీ లక్ష్మయ్య

దెందులూరు: ప్రతి ఒక్కరూ మాదకద్రవ్యాలకు వినియోగానికి దూరంగా ఉండాలని, ముఖ్యంగా యువత వాటి జోలికి వెళ్లవద్దని నూజివీడు డీఎస్పీ కె.లక్ష్మయ్య సూచించారు. బుధవారం గోపన్నపాలెం వ్యాయామ విద్యాకళాశాలలో ప్రిన్సిపాల్ ఎస్ నత్తానియేలు అధ్యక్షతన పెదవేగి సీఐ కె.శ్రీనివాసకుమార్ ఆధ్వర్యంలో మాదక ద్రవ్యాల నిరోధక అవగాహన సమావేశం నిర్వహించారు. డీఎస్పీ లక్ష్మయ్య మాట్లాడుతూ యువత ప్రాథమిక స్థాయి నుంచి ఆధ్యాత్మిక చింతన, విద్య, సామాజిక సేవ, ఇతర రంగాలపై లక్ష్యాన్ని నిర్దేశించుకుని, వాటి సాధనకు కృషి చేయాలని సూచించారు. చెడు స్నేహాల జోలికి పోవద్దన్నారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు నిరంతరం విద్యార్థుల వ్యవహార శైలిని గమనించాలన్నారు. మాదక ద్రవ్యాలకు అలవాటుపడితే ఆరోగ్యం, జీవితం పాడుకావడమే కాకుండా శిక్షలను సైతం ఎదుర్కోవాల్సి ఉంటుందని అన్నారు. ఎస్సైలు కె.స్వామి, రాజేంద్రప్రసాద్, వ్యాయామ కళాశాల సిబ్బంది, విద్యార్థులు ఉన్నారు.

కార్యకర్తలకు అండగా ఉంటాం

బుట్టాయగూడెం: వైఎస్సార్ సీపీ కార్యకర్తలు ఎవ్వరూ అధైర్య పడవద్దని, తాము అండగా ఉంటామని పార్టీ జీలుగుమిల్లి మండల కమిటీ భరోసా ఇచ్చింది. జీలుగుమిల్లి మండల కమిటీ ముఖ్య నాయకుల సమావేశం బుధవారం ఆ పార్టీ మండల కన్వీనర్ చందా ప్రసాద్ అధ్యక్షతన జరిగింది. నాయకులు బోదా శ్రీనివాసరెడ్డి, గూడవల్లి శ్రీనివాసరావు, సర్పంచ్ సిర్రి జగదాంబ, ఎంపీపీ కోర్సా పోచమ్మ, తదితరులు మాట్లాడారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత చోటుచేసుకున్న పరిణామాల పట్ల కార్యకర్తలెవ్వరూ అధైర్యపడవద్దని, అందరికీ అండగా ఉంటామని చెప్పారు. జీలుగుమిల్లి మండలంలో వైఎస్సార్‌సీపీ ఎంతో బలంగా ఉందన్నారు. ఇటీవల జరిగిన సాధారణ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి తెల్లం రాజ్యలక్ష్మి, ఎంపీ అభ్యర్థి కారుమూరి సునీల్‌లకు 3 వేల మెజారిటీని జీలుగుమిల్లి మండల ప్రజలు అందించారని అన్నారు. ఈ సందర్భంగా ప్రజలందరికీ కృతజ్ఞతలు తెలిపారు. వైఎస్సార్‌సీపీపై నమ్మకంతో ఓట్లు వేసిన ప్రజలందరికీ రుణపడి ఉంటామని చెప్పారు. ప్రతి కార్యకర్తకు మండల కమిటీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. రాబోయే స్థానిక ఎన్నికల్లో సంపూర్ణ విజయం సాధించే విధంగా కృషి చేస్తామని తెలిపారు. తొలుత గ్రామంలో ఉన్న వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నాయకులు, కార్యకర్తలు ఘన నివాళులు అర్పించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ సోమగాని శ్రీను, ఎంపీటీసీ మొడియం వెంకటలక్ష్మి, నాయకులు బూరుగు ప్రేమ్‌కుమార్, చిట్టిబొమ్మ శ్రీను, కక్కిరాల చక్రి, వనమా రామకృష్ణ, మహేష్ పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ భవన నిర్మాణం పరిశీలన



భవనాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే చంటి

ఏలూరు టౌన్: ఏలూరులోని పెద్ద రైల్వేస్టేషన్ సమీపంలో వైఎస్సార్ సీపీ జిల్లా కార్యాలయ భవనాన్ని ఎమ్మెల్యే బడేటి చంటి బుధవారం పరిశీలించారు. భవన నిర్మాణ అనుమతులపై ఆరా తీశారు. ఇటీవల రూ.15 లక్షలు నగరపాలక సంస్థకు చెల్లించారని, ఆన్‌లైన్‌లో ప్రాథమికంగా అనుమతులు లభించినట్టు అధికారులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లినా వాటిని, టీడీపీ నేతలు పట్టించుకోలేదని చెబుతున్నారు. ఇదిలా ఉండగా ఈ కార్యాలయ భవనానికి ఎలాంటి అనుమతులు లేవని, ఇందులో ఏలూరు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ కార్యాలయం లేదా జూనియర్ కాలేజీ నిర్వహణకు ఉపయోగించేలా ప్రభుత్వానికి నివేదిస్తామని ఎమ్మెల్యే తెలిపారు. కోర్టులకు వెళ్లినా ఉపయోగం లేదని, తాము ఏమి చేయాలో అది చేస్తామని ఎమ్మెల్యే చంటి తెలిపారు. ఎమ్మెల్యే వెంట నగర కమిషనర్ సంక్రాంతి వెంకటకృష్ణ, టౌన్‌ప్లానింగ్ అధికారులు, టీడీపీ నాయకులు ఉన్నారు.

ఎస్సీ, ఎస్టీ కమిషన్లకు అధికారాలు కల్పించాలి

దెందులూరు: జాతీయ, రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్లకు హైకోర్టు అధికారాలు కల్పించాలని రాజ్యసభ సభ్యుడు గొల్లబాబురావుకు వైఎస్సార్ సీపీ సీనియర్ నేత, ఫారెస్ట్ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ పళ్లెం ప్రసాద్ కోరారు. ఈ మేరకు లేఖను బుధవారం బాబురావుకు ఈ మెయిల్‌లో పంపారు. ప్రస్తుత పార్లమెంట్ సమావేశాల్లోనే ఎస్సీ, ఎస్టీ కమిషన్లకు హైకోర్టు అధికారాలు కల్పించేలా కేంద్ర ప్రభుత్వానికి సూచన చేయాలని కోరారు. ఎస్సీ, ఎస్టీ కమిషన్లు విశిష్ట అధికారాలు ఉంటేనే దేశంలో కోట్లాది మంది దళిత, గిరిజనులకు రక్షణ, న్యాయం, భద్రత, భవిష్యత్తు లభిస్తుందని తెలిపారు. కేంద్ర ప్రభుత్వంపై కమిషన్లకు హైకోర్టు అధికారాలు ఇచ్చే వరకు దళితులు తరపున అందరిని కలుపుకుని తన వంతు కృషి చేస్తానని ప్రసాద్ పేర్కొన్నారు.

విద్యార్థులకు పుస్తకాల పంపిణీ

దెందులూరు: పోతునూరు ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు నోటు, పాఠ్య పుస్తకాలు పంపిణీ చేశారు. మాజీ ఎంపీటీసీ తలారి ధన్యకుమార్, కొండేటి మోహన్, నున్నా లక్ష్మణ్‌బాబు, గండి రాజా, ఇప్పిలి వెంకటేశ్వరరావు, జక్కుల జాన్‌రాజు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.